సాక్షి కామారెడ్డి

శనివారం ¦ 18 ¦ నవంబర్ ¦ 2023



అభివృద్ధిలో భాగమవ్వాలి

కేసీఆర్ సారథ్యంలో రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని బీఆర్‌ఎస్ నేత సుభాష్ రెడ్డి ప్రజలను కోరారు.

- 11లో ▸



ఆత్మరక్షణకు కరాటే

జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు ఆత్మరక్షణ కోసం కరాటే నేర్పిస్తున్నారు.

- 12లో ▸

గరిష్టం/కనిష్టం

33.9 /16.2

వాతావరణం

ఉదయం శీతల గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరిగే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

‘అభ్యర్థుల ఖర్చులపై నిఘా ఉంచాం’



మద్నూర్: అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులు చేస్తున్న ఖర్చులపై నిఘా ఉంటుందని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు పరా శివమూర్తి పేర్కొన్నారు. అభ్యర్థుల ప్రచార ఖర్చులను పరిశీలిస్తున్నామన్నారు. మండల కేంద్రంలోని రిటర్నింగ్ కార్యాలయంలో శుక్రవారం జుక్కల్ నియోజకవర్గ అభ్యర్థుల ఎన్నికల వ్యయాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అభ్యర్థులు, వారి ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడారు. రోజు అభ్యర్థుల ఎన్నికల ఖర్చులను రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

మండల కేంద్రంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో శుక్రవారం హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన ఏదైన సమాచారం కోసం హెల్ప్ డెస్క్‌లో సంప్రదించవచ్చని సూచించారు. కార్యక్రమంలో జుక్కల్ రిటర్నింగ్ అధికారి మనుచౌదరి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ముజీబ్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ భరత్, అసిస్టెంట్ వ్యయ పరిశీలన అధికారి మురళీధర్, సీనియర్ అసిస్టెంట్ విజయ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతిచక్ర అవార్డులు




కామారెడ్డి టౌన్: కామారెడ్డి ఆర్టీసీ డిపో పరిధిలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు శుక్రవారం డిపో ఆవరణలో ప్రగతిచక్ర అవార్డులను అందజేశారు. అక్టోబర్‌లో అత్యధికంగా కలెక్షన్‌లు తీసుకువచ్చిన కండక్టర్లు, అధిక డీజిల్ పొదుపు చేసిన డ్రైవర్లకు అవార్డులు అందించినట్లు డిపో మేనేజర్ ఇందిర తెలిపారు. కార్యక్రమంలో డిపో అధికారులు వసుంధర, లింగమూర్తి పాల్గొన్నారు.

‘హస్త’వ్యస్తానికి బీఆర్‌ఎస్ ఎత్తులు

- షబ్బీర్ అలీ సొంత మండలం నుంచే వలసలు మరూ
- గులాబీ కండువా కప్పుకున్న మాచారెడ్డి మండల అధ్యక్షుడు
- ఇప్పటికే పార్టీ మారిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్
- మరికొందరిపైనా ఫోకస్ చేసిన అధికార పార్టీ నేతలు

విజయమే లక్ష్యంగా సాగుతున్న పార్టీలు.. తమ బలాన్ని పెంచుకోవడంతోపాటు ప్రత్యర్థి బలాన్ని తక్కువ చేయడానికీ ప్రయత్నాలు చేస్తున్నాయి. జోరుగా ప్రచారం చేస్తూనే ఇతర పార్టీలనుంచి వలసలను ప్రోత్సహిస్తున్న అభ్యర్థులు.. ప్రత్యర్థి పార్టీల్లోని ప్రధాన నేతల కండువాలు మార్చేందుకు కసరత్తు చేస్తున్నారు. బీఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్ నేతలపై వల విసురుతూ గులాబీ కండువా కప్పేస్తున్నారు.



సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంనుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సీఎం కేసీఆర్ పోటీ చేస్తుండడంతో ఆ పార్టీ నేతలు ఈ ఎన్నికలను చాలెంజ్‌గా తీసుకున్నారు. ప్రత్యర్థి పార్టీల్లో చురుకైన నేతలతో పాటు, అసంతృప్తితో ఉన్న వాళ్లను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను దెబ్బ తీసేందుకు మాజీ మంత్రి షబ్బీర్‌అలీ సొంత మండలం మాచారెడ్డిపై బీఆర్‌ఎస్ నేతలు దృష్టి సారించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గణేశ్‌నాయక్‌ను గురువారం రాత్రి మంత్రి కేటీఆర్ వద్దకు తీసుకువెళ్లి గులాబీ కండువా కప్పించారు. అదే మండలానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొన్నాల లక్ష్మారెడ్డి కండువా మార్చేశారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, మాచారెడ్డి ఎంపీపీ నర్సింగరావు తదితరులు లక్ష్మారెడ్డి ఇంటికి వెళ్లి గులాబీ తీర్థం ఇచ్చారు. మరికొందరు కూడా బీఆర్‌ఎస్‌తో టచ్‌లో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో క్రియాశీలకంగా ఉన్న కాంగ్రెస్ నేతలపై బీఆర్‌ఎస్ నేతలు ఫోకస్ చేసినట్లు సమాచారం. కాగా మాచారెడ్డిలో నాలుగు రోజుల క్రితం పీసీసీ అధ్యక్షుడు, కామారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్‌రెడ్డి పర్యటనలో చురుకుగా పనిచేసిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గణేశ్‌నాయక్ అకస్మాత్తుగా పార్టీ మారడంతో కాంగ్రెస్ శ్రేణులు షాక్‌కు గురయ్యాయి.

వ్యూహాత్మకంగా అడుగులు..

ప్రత్యర్థి పార్టీలను బలహీనపర్చడం ద్వారా వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బకొట్టే వ్యూహంతో అధికార పార్టీ నేతలు పావులు కదుపుతున్నట్లు స్పష్టమవుతోంది. బీఆర్‌ఎస్ ఎక్కువగా కాంగ్రెస్‌పై ఫోకస్ చేసింది. నియోజకవర్గంలో దశాబ్దాలుగా కాంగ్రెస్‌కు పెద్ద దిక్కుగా ఉన్న షబ్బీర్ అలీ ఈసారి కామారెడ్డినుంచి పోటీ చేయడం లేదు. ఆయన నిజామాబాద్ అర్బన్ నుంచి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఆయన కామారెడ్డినుంచి పోటీ చేయకపోవడంతో కాంగ్రెస్‌కు చెందిన పలువురు నిరాశతో ఉన్నారు. ఇదే అదనుగా బీఆర్‌ఎస్ నేతలు వారిని కారెక్కించడం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. నిన్నమొన్నటి దాకా షబ్బీర్‌అలీ వెన్నంటి ఉన్న మాచారెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గణేశ్‌నాయక్, ఏఎంసీ మాజీ చైర్మన్ పొన్నాల లక్ష్మారెడ్డిలు గులాబీ గూటికి చేరడంతో బీఆర్‌ఎస్ నేతలు మరికొందరిపైనా దృష్టి సారించారు.

అలాగే కామారెడ్డి నియోజకవర్గంలో బీజేపీకి సైతం బలమైన క్యాడర్ ఉంది. ఆ పార్టీ శ్రేణులు చాలావరకు బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి వెంటే ఉన్నారు. వాళ్లలో ఇటీవల ఒక కౌన్సిలర్ పార్టీని వీడి గులాబీ గూటికి చేరారు. తర్వాత వెంకటరమణారెడ్డి అనుచరులెవరూ పార్టీని వదిలిపెట్ట లేదు. అయితే నియోజకవర్గంలో మరో గ్రూపుగా కొనసాగిన రాష్ట్ర నాయకుడు ఎంజీ వేణుగోపాల్‌గౌడ్‌కు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గులాబీ కండువా కప్పారు.



మాచారెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గణేశ్‌నాయక్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేటీఆర్

అంతా కేటీఆర్ కనుసన్నల్లో..

కామారెడ్డి ఎన్నికల ఇన్‌చార్జీగా వ్యవహరిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిత్యం పార్టీ ముఖ్య నేతలతో ఫోన్‌లో మాట్లాడుతూ పరిస్థితి తెలుసుకుంటూ దిశానిర్దేశం చేస్తున్నారు. నియోజకవర్గంలో తటస్తులు, వ్యాపారవేత్తలు, మేధావులతోనూ కేసీఆర్ మాట్లాడుతూ వారి మద్దతు కూడగడుతున్నారు. నియోజకవర్గంలో రెండు రోజుల పాటు నాలుగు సమావేశాల్లో పాల్గొన్న మంత్రి కేటీఆర్ శుక్రవారం పలు మండలాల్లో రోడ్ షోలు నిర్వహించనున్నారు. అలాగే ఎన్నికల ప్రచారం ముగిసేనాటికి మరో రెండు, మూడు పర్యాయాలు నియోజకవర్గంలో కేటీఆర్ సుడిగాలి పర్యటనలకు ప్లాన్ చేస్తున్నారు.

సమస్యలకు కారణం కాంగ్రెస్సే



దోమకొండ మండలంలోని ముత్యంపేటలో బీఆర్‌ఎస్ రోడ్‌షోలో పాల్గొన్న ప్రజలు

- వారికి ఓటేస్తే కష్టాలు కొని తెచ్చుకున్నట్లే..
- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

దోమకొండ: సమస్యలకు కారణం కాంగ్రెస్ పార్టీయేనని, అలాంటి పార్టీకి ఓటేస్తే తిరిగి గతంలో పడ్డ కష్టాలను కొని తెచ్చుకున్నట్లేనని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ విమర్శించారు. శుక్రవారం దోమకొండ మండలంలోని చింతమాన్‌పల్లి, ముత్యంపేట, లింగుపల్లి, గొట్టిముక్కుల, అంచనూరు, సీతారాంపల్లి తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యే నాటికి ఈ ప్రాంతం సమస్యలతో కొట్టుమిట్టాడుతోందన్నారు. తాగు, సాగునీరు లేవని, విద్యుత్ కష్టాలు ఉండేవని పేర్కొన్నారు. కాంగ్రెస్‌ను నమ్మితే తిరిగి మళ్లీ కరెంట్ కష్టాలు వస్తాయన్నారు. అభివృద్ధిలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. కామారెడ్డిలో కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. రేవంత్‌రెడ్డి చెప్పే మాటలను నమ్మవద్దని, బీజేపీ రైతులకు ఆదుకోవడంలో విఫలమైందని విమర్శించారు. ప్రచారంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంధ్ర మధుసూదన్‌రావు, జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య, సర్పంచ్‌లు సార్ల నర్సవ్వ, సూర్యప్రకాష్‌రెడ్డి, నల్లపు అంజలి, నరేష్, బురాని సమత, జాలిగాం నాంపల్లి, ధర్పల్లి స్వరూప, వైస్ ఎంపీపీ బాపురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

ప్రచారం.. ఆహారం..

ఎన్నికల ప్రచారంలో ఊళ్లను చుట్టేస్తున్న అభ్యర్థులు.. ఎక్కడ వీలయితే అక్కడే క్షుద్బాధను తీర్చుకుంటున్నారు. శుక్రవారం రామారెడ్డి మండలంలో ప్రచారం చేసిన ఎల్లారెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్.. రంగంపేట శివారులో ఓ బెంచీపై కూర్చొని భోజనం చేశారు.

– సాక్షి, కామారెడ్డి



ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి

- రాష్ట్ర ప్రత్యేక సాధారణ పరిశీలకుడు అజయ్ వి నాయక్

కామారెడ్డి క్రైం: జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించడానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన రాష్ట్ర ప్రత్యేక సాధారణ పరిశీలకుడు అజయ్ వి నాయక్ జిల్లా యంత్రాంగానికి సూచించారు. శుక్రవారం ఆయన కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రత్యేక పోలీస్ పరిశీలకుడు దీపక్ మిశ్రాతో కలిసి కామారెడ్డికి వచ్చారు. కలెక్టరేట్ వద్ద వారికి కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధు శర్మ స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్‌లో సమావేశం ఏర్పాటు చేసి జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లపై ఎన్నికల సాధారణ పరిశీలకులు అర్థుర్ వర్ఛ్యాయియో, జగదీష్, పోలీస్ పరిశీలకుడు అబ్దుల్ ఖయ్యూమ్‌లతో సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశీలకులు మాట్లాడుతూ ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే వెంటనే స్పందించి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు పోలీస్ బలగాలను మోహరించాలని సూచించారు. ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణాన్ని కల్పించాలని సూచించారు.



ఎన్నికల ఏర్పాట్లను రాష్ట్ర పరిశీలకులకు వివరిస్తున్న కలెక్టర్ పాటిల్

బరిలో 67 మంది అభ్యర్థులు..

జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లను కలెక్టర్ జితేష్ వి పాటిల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్ర పరిశీలకులకు వివరించారు. జిల్లా ఎన్నికల విభాగం పరిధిలోని మూడు నియోజకవర్గాలలో 67 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారన్నారు. ఎల్లారెడ్డిలో ఒక, జుక్కల్ 2, కామారెడ్డిలో 3 బ్యాలెట్ యూనిట్ల అవసరం ఉంటుందన్నారు. జిల్లాలో 239 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి తగిన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 396 పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్ పూర్తయ్యిందన్నారు. మూడు నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ప్రక్రియను జిల్లా కేంద్రంలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గత ఎన్నికలలో రాష్ట్ర స్థాయిలో 73 శాతం పోలింగ్ నమోదు కాగా జిల్లాలో 83 శాతం పోలింగ్ నమోదైందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు రూ. 4.31 కోట్ల విలువైన నగదు, మద్యం, మత్తుపదార్థాలు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామని ఎస్పీ సింధు శర్మ తెలిపారు. కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దులతో పాటు జిల్లా సరిహద్దుల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడ సమస్య తలెత్తినా వెంటనే చేరుకునేలా మొబైల్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

కామారెడ్డిపైనే ఫోకస్

- పోటాపోటీ ప్రచారాలకు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కసరత్తు
- నేడు రేవంత్‌రెడ్డి, కేటీఆర్‌ల రోడ్‌షోలు
- పోలింగ్ తేదీ సమీపిస్తుండడంతో స్పీడ్ పెంచిన నేతలు

సాక్షి, కామారెడ్డి: ప్రధాన పార్టీలు కామారెడ్డి నియోజకవర్గంపైనే ఎక్కువగా ఫోకస్ చేశాయి. ముఖ్యనేతలు పోటీ చేస్తుండడంతో ఇక్కడ రాజకీయాలు రసవత్తరంగా నడుస్తున్నాయి. అధికార పార్టీ నుంచి సీఎం కేసీఆర్, కాంగ్రెస్ పార్టీ నుంచి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పోటీ పడుతుండంతో ఇరు పార్టీల నేతలూ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. వీరిద్దరితో తలపడుతున్న బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి రోజూ ఏడెనిమిది గ్రామాలను చుట్టేస్తున్నారు.

కామారెడ్డి నియోజకవర్గంలో మూడు ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య నువ్వా నేనా అన్నరీతిలో పోటీ నడుస్తోంది. దీంతో ఆయా పార్టీలు ప్రచారాన్ని మరింత ముమ్మరం చేశాయి. సీఎం కేసీఆర్ నియోజకవర్గంలో నామినేషన్ వేసిన రోజు బహిరంగ సభలో ప్రసంగించారు. ఆయన తరఫున నియోజకవర్గ ఇన్‌చార్జీ బాధ్యతలు చూస్తున్న మంత్రి కేటీఆర్ రెండుమూడు పర్యాయాలు నియోజకవర్గంలో పర్యటించారు. రోజూ పార్టీ నేతలతో పరిస్థితిని సమీక్షిస్తున్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నామినేషన్ వేసిన రోజున సభలో ప్రసంగించారు. మరో రోజు నాలుగైదు చోట్ల కార్నర్ మీటింగ్‌లలో పాల్గొన్నారు. పార్టీ శ్రేణులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగించారు. బీజేపీ అభ్యర్థికి మద్దతుగా ఇటీవల నిర్వహించిన బైక్ ర్యాలీ, సభలలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. నామినేషన్ కార్యక్రమానికి కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాలా హాజరయ్యారు.



ఆధిపత్యం కోసం..

ప్రచారంలో పైచేయి సాధించడం కోసం బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నాయి. ఇందులో భాగంగా దోమకొండ పాత తాలూకాపై ఆ పార్టీలు దృష్టి పెట్టాయి. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం కామారెడ్డి నియోజకవర్గంలో పర్యటించనున్నారు. భిక్కనూరు, బీబీపేట, దోమకొండ మండలాల్లో పర్యటించనున్నారు. పెద్దమల్లారెడ్డి, కాచాపూర్, మాందాపూర్, జనగామ, బీబీపేటలలో రోడ్‌షోలలో పాల్గొంటారు. అలాగే పీసీసీ చీఫ్, కామారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్‌రెడ్డి సైతం శనివారమే పర్యటించనున్నారు. కామారెడ్డి మండలంలోని చిన్న మల్లారెడ్డి, రాజంపేట, భిక్కనూరు మండల కేంద్రాలలో రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లలో పాల్గొననున్నారు. ఇద్దరు ముఖ్య నేతలు నిర్వహించనున్న రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లతో ఒకింత టెన్షన్ వాతావరణం నెలకొంది. ఇరువురు నేతలు విమర్శలు, ప్రతివిమర్శలకు దిగే అవకాశాలున్నాయి. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు రెండు పార్టీల నేతలు జన సమీకరణపై దృష్టి సారించారు.

ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలి

కామారెడ్డి క్రైం: ప్రతి ఓటరుకు ఓటరు స్లిప్పులు, ప్రతి కుటుంబానికి ఒక ఓటరు గైడ్ పుస్తకం పంపిణీ చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. శుక్రవారం కామారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో సెక్టోరల్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్ స్థాయి అధికారులు రోజూ 100 నుంచి 120 ఇళ్లకు వెళ్లి ఓటరు స్లిప్పులు అందించాలన్నారు. సి-విజిల్ యాప్ ప్రాముఖ్యత, తప్పనిసరిగా ఓటు వేయడం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి తదితర అంశాలపై ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. అధికారులు ఓటింగ్ యంత్రాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ రోజు అదనపు ఈవీఎంలతో ప్రెసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. సాంకేతిక సమస్య తలెత్తిన ఈవీఎంలను మార్చాలన్నారు. ఏమైనా సందేహాలుంటే ఈనెల 23, 24 తేదీలలో ఈసీఐఎల్ నుంచి వచ్చే ఇంజినీర్లతో సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ లత, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

జుక్కల్‌కు అదనపు బ్యాలెట్ యూనిట్లు..

జుక్కల్ నియోజకవర్గంలో 17 మంది అభ్యర్థులు బరిలో ఉన్నందున అదనపు బ్యాలెట్ యూనిట్లకు ప్రత్యేకంగా ర్యాండమైజేషన్ చేపట్టినట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ర్యాండమైజేషన్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాలట్ యూనిట్ల పంపిణీలో ఎవరికీ ఎలాంటి అనుమానాలు ఉండకూడదనే ఉద్దేశంతో ఎన్నికల కమిషన్ ర్యాండమైజేషన్ కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించిందన్నారు. తద్వారా ఏ బ్యాలట్ యూనిట్, వీవీ ప్యాట్ ఎక్కడికి వెళ్తుందో ఎవరికీ తెలియదన్నారు. అదనపు ఓటింగ్ యంత్రాలను కట్టుదిట్టమైన భద్రత మధ్య జుక్కల్ నియోజకవర్గానికి తరలించి అక్కడ శనివారం రాజకీయ పక్షాల సమక్షంలో పరిశీలించి, స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరుస్తామన్నారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఈనెల 21, 22 తేదీలలో యంత్రాల నిర్వహణ, మాక్ పోలింగ్ పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 10 పోలింగ్ బూత్‌లకు ఒక సెక్టోరల్ అధికారిని నియమించామన్నారు. వారు యంత్రాల నిర్వహణలో సమస్యలను పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల పర్యవేక్షకులు పాల్గొన్నారు.

ఓటరు కార్డుకు 28 ఏళ్లు..

- 1995లో తొలిసారిగా గుర్తింపు కార్డుల జారీ
- దొంగ ఓట్లను నివారించేందుకు నాటి కేంద్ర ఎన్నికల కమిషనర్ టీఎన్ శేషన్ వినూత్న ప్రయోగం



ఆర్మూర్: ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్యమైన భారత దేశంలో ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు రాజ్యాంగం ఎన్నికల కమిషన్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించింది. ఎన్నికలను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ ఏర్పాటైన నాటి నుంచి నేటి వరకు అనేక సంస్కరణలు తెచ్చింది. అందులో భాగంగా దొంగ ఓట్లను అరికట్టేందుకు ఓటరు గుర్తింపు కార్డులను అమలులోకి తెచ్చారు. ఓటరు గుర్తింపు కార్డులు అమలులోకి వచ్చి 28 ఏళ్లు గడుస్తోంది. 1995లో నాటి కేంద్ర ఎన్నికల కమిషనర్ టీఎన్ శేషన్ ఓటరు నమోదు పారదర్శకంగా ఉండటంతో పాటు దొంగ ఓట్లను అరికట్టేందుకు ఓటరు గుర్తింపు కార్డులను ప్రవేశపెట్టారు. అప్పట్లో ఈ నిర్ణయం సంచలనం కలిగించింది. ఓటరు జాబితాలో ఉన్న క్రమ సంఖ్య ప్రకారం ఓటరు ఫొటోను కార్డుపై ముద్రించి ఇస్తున్నారు. ఐడీ కార్డుపై పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, జనన తేదీ, కార్డు హోల్డర్ చిరునామా సైతం ముద్రిస్తారు. సీరియల్ నెంబర్, హోలో గ్రామ్ స్టిక్కర్, కార్డును జారీ చేసిన అధికారి స్టాంపు, సంతకం కూడా ఉంటాయి. దీనిపై ముద్రించిన సీరియల్ నెంబర్ చాలా ముఖ్యమైనవి అయినప్పటికీ ఇది ప్రతీ సంవత్సరం మారుతుంది.

ఎన్నికల కమీషన్ ద్వారా ఓటర్ లిస్టు డాటాను ఆన్‌లైన్‌లో ఉంచినపుడు ఓటరు తమ ఎన్నికల సంఖ్య, సీరియల్ నెంబర్‌ను సులభంగా కనుక్కోవచ్చు. ఓటరు కార్డు ఉంటేనే ఓటు వేసే విధంగా నిబంధనలు విధించడంతో దొంగ ఓట్ల నివారణకు తోడ్పాటైంది. భారతీయ పౌరసత్వం కలిగి 18 సంవత్సరాల వయసు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు పొందడంతో పాటు ఓటరు కార్డుకు దరఖాస్తు చేసుకొనే అవకాశాలను పలు మార్లు కల్పించారు. అప్పట్లో బ్లాక్ అండ్ వైట్‌లో ఉన్న ఓటరు గుర్తింపు కార్డులను ఇప్పుడు డిజిటల్ విధానంలో ముద్రిస్తున్నారు.

ఓటు హక్కుపై అవగాహన

ఓటరు గుర్తింపు కార్డు అందుబాటులోకి వచ్చాక ప్రజలకు తమ ఓటు హక్కుపై పూర్తి అవగాహన వచ్చింది. ఓటరు జాబితాలో ఓటరు ఫొటో ముద్రిస్తుండటంతో మరింత పారదర్శకత పెరిగింది. ఓటరు గుర్తింపు కార్డు అన్నది ప్రతీ ఓటరుకు అందుబాటులోకి వచ్చింది. ఓటరు గుర్తింపు కార్డుతో పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఓటరును పోలింగ్ ఏజంట్లు సులువుగా జాబితాలో ఉన్న పేరును సరిచూసుకొని ఓటు వేయడానికి ఎన్నికల అధికారులు అవకాశాన్ని కల్పిస్తున్నారు. అయితే ఓటరు గుర్తింపు కార్డులు అందుబాటులో లేని వారు పోల్ చిట్టిలో పొందుపరిచిన తమ ఓటు క్రమ సంఖ్య వివరాలతో కూడా ఓటు వేయడానికి అవకాశం కల్పించారు.

క్లుప్తంగా

5 వరకు పరీక్ష ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పీజీ రెగ్యులర్ పరీక్ష ఫీజును డిసెంబర్ 5వ తేదీ వరకు చెల్లించవచ్చని పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ అరుణ శుక్రవారం తెలిపారు. ఎంబీఏ, ఎంసీఏ, ఐఎంబీఏ కోర్సుల్లో 3, 9వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు ఈ షెడ్యూల్ వర్తిస్తుందన్నారు. రూ. వంద అపరాధ రుసుముతో డిసెంబర్ 6వరకు చెల్లించే అవకాశం ఉందన్నారు. తెయూ పరిధిలోని అన్ని అనుబంధ పీజీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. పూర్తి వివరాలకు తెయూ వెబ్‌సైట్ www.telanganauniversity.co.inను సంప్రదించాలని సూచించారు.

సామాజిక బాధ్యతపై అవగాహన అవసరం



తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక బాధ్యత కలిగి ఉండాలని తెయూ రిజిస్ట్రార్ యాదగిరి పేర్కొన్నారు. తెయూ కంప్యూటర్ సైన్స్ కాలేజ్ సెమినార్ హాల్‌లో శుక్రవారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులకు నిర్వహించిన ఒక రోజు అవగాహన సదస్సుకు రిజిస్ట్రార్ హాజరై మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు సామాజిక బాధ్యతపై ప్రోగ్రాం అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆరతి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రవీందర్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్స్ మహేందర్, సంపత్, స్రవంతి, స్వప్న, అధికారులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపరులకు ఓట్లతో బుద్ధి చెప్పాలి

- బీఆర్ఎస్ బాన్సువాడ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి



వర్ని(చందూర్): ఎన్నికల్లో అవినీతిపరులకు ఓట్లతో బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ బాన్సువాడ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. చందూర్ మండలంలోని ఘన్‌పూర్, చందూర్, కారేగాం, మేడిపల్లి, లక్ష్మాపూర్ గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారేగాంలో గిరిజనులతో కలిసి పోచారం నృత్యం చేశారు. నిజాంసాగర్ నాన్ కమాండ్ ఏరియా రైతుల సాగునీటి కష్టాలు తీర్చేందుకు రూ. 150 కోట్లతో లిఫ్టు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. సొంత నియోజకవర్గాల్లో ఓటమిపాలైన వారు పక్క నియోజకవర్గాల్లో ఎలా గెలుస్తారని అన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి ఎంతో చేశానని ఈసారి కూడా ఎన్నికల్లో గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో చందూర్ ఎంపీపీ లావణ్యారాంరెడ్డి, మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు కవిత, సర్పంచులు సాయిరెడ్డి, సత్యనారాయణ, గంగారాం పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ మోస్రా మండలాధ్యక్షుడు

బీజేపీ మోస్రా మండల అధ్యక్షుడు కోనపురం స్వామిగౌడ్ బీఆర్ఎస్ బాన్సువాడ నియోజకవర్గ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో పార్టీలో శుక్రవారం చేరారు. చందూర్‌లో నిర్వహించిన ప్రచారంలో స్వామిగౌడ్‌కు పోచారం కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీలో నాయకులను ఎదగనివ్వకపోవడం, ఒంటెద్దు పోకడలు అధికమయ్యాయని, కొందరు నాయకుల ప్రవర్తన నచ్చక పార్టీ మారినట్లు స్వామి గౌడ్ తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు హనుమంత్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కో-ఆర్డినేటర్ పిట్ల శ్రీరాములు, పార్టీ మండల కార్యదర్శి సాయాగౌడ్ పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి



మైనార్టీ నాయకులతో పోచారం భాస్కర్‌రెడ్డి



బోర్లంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

- డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ: తెలంగాణ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తోందని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని అర్బాత్ కాలనీ, మదీనా కాలనీ, టీచర్స్ కాలనీ, పెద్ద మజీద్‌ల వద్ద మైనార్టీలను కలిసి కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. ఈ సందర్భంగా మైనార్టీలనుద్దేశించి మాట్లాడారు. దేశంలోనే మన రాష్ట్రంలో మైనార్టీలకు అత్యధిక నిధులు కేటాయించిందని, రాష్ట్రంలో 200 మైనార్టీ గురుకులాలు ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. రంజాన్ రోజున పేద ముస్లింలకు దుస్తులు పంపిణీ చేసి, ప్రభుత్వమే అధికారికంగా పండగను నిర్వహిస్తుందని అన్నారు. నియోజకవర్గంలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి మజీద్‌లు, ఈద్గాలు, దర్గాల నిర్మాణాలకు రూ.40 కోట్లతో మరమ్మతులు చేయించారని గుర్తు చేశారు. భవిష్యత్‌లో మైనార్టీలు మరింత అభివృద్ధి చెందాలంటే కారు గుర్తుకే ఓటేయాలని సూచించారు. నేక్ బీబీ సాహెబ దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నాయకులు ఎజాస్, వాహబ్, హకీం, రఫీ, జుబేర్, ఖయ్యూం, ఖమ్రు, ఇలియాస్ తదితరులున్నారు.

బీర్కూర్‌లో ఇంటింటా ప్రచారం

బాన్సువాడ : బీర్కూర్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్ మాట్లాడుతూ.. బీర్కూర్ మండలంలో అత్యధికంగా డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టించిన ఘనత పోచారం శ్రీనివాస్‌రెడ్డికే దక్కిందన్నారు. బీర్కూర్‌కు చెందిన కాంగ్రెస్ నేత శివాజీ బీఆర్ఎస్‌లో చేరారు. నాయకులు సందీప్, రఘు, స్వరూప, శశికాంత్ తదితరులు ఉన్నారు.

బోర్లం, బుడ్మి తదితర గ్రామాల్లో..

బాన్సువాడ రూరల్: బోర్లం, ఇబ్రహీంపేట్, బుడ్మి, తాడ్కోల్, కోనాపూర్ తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి తెలంగాణ ప్రభుత్వం, పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. కారుగుర్తుకు ఓటేసి పోచారం శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

జుక్కల్‌లో ముక్కోణపు పోరు

- ఎన్నికల్లో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు ఒకరు కొత్త అభ్యర్థి
- ప్రచారాల్లో నిమగ్నమైన ప్రధాన పార్టీల అభ్యర్థులు
- పోటీలో గెలిచేదెవరో..?



హన్మంత్‌సింధే



తోట లక్ష్మీకాంతరావు



అరుణతార

నిజాంసాగర్: అసెంబ్లీ ఎన్నికల్లో జుక్కల్ నియోజకవర్గంలో ముక్కోణపు పోరు నెలకొననుంది. నామినేషన్లు, ఉపసంహరణల అనంతరం జుక్కల్‌లో 17 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల అభ్యర్థులు ప్రచారాన్ని జోరుగా కొనసాగిస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్‌సింధే 2009, 20014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించారు. బీజేపీ అభ్యర్థి అరుణతార 1999లో నిర్వహించిన ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఈ సారి కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాంను పోటీ నుంచి తప్పించి ఎన్ఆర్ఐ అయిన తోట లక్ష్మీకాంతరావు టికెట్ ఇవ్వడంతో ఆయన తనదైన శైలిలో ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు.

ప్రచారాల్లో దూసుకెళ్తున్న అభ్యర్థులు

ఎన్నికల ప్రచారాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులైన హన్మంత్‌సింధే, తోటలక్ష్మీకాంతరావు, అరుణతారా దూసుకెళ్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్‌సింధే జుక్కల్‌లో నిర్వహించిన బహిరంగ సభకు సీఎం కేసీఆర్ హాజరై బీఆర్ఎస్ చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ అభ్యర్థి తోట లక్ష్మీకాంతరావు పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలను ఏకతాటిపైకి తీసుకొచ్చిన ప్రచారంలో నిమగ్నమయ్యారు. అన్ని మండలాలు, గ్రామాల్లో ప్రచారం జోరుగా సాగుతోంది. బీజేపీ అభ్యర్థి అరుణతార ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అరుణతారకు మద్దతుగా ఎన్నికల ప్రచారం, రోడ్‌షో కార్యక్రమం నిర్వహించారు. బిచ్కుందలో బండి సంజయ్ రోడ్‌షోకు యువకులు, ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఇరు పార్టీల అభ్యర్థులతో పాటు పార్టీ నేతలు తమ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచార జోరు పెంచుతున్నారు.

జంగ్ తెలంగాణ

ఓటు చైతన్యంపై చిత్రలేఖనం



గీసిన బొమ్మలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కామారెడ్డి అర్బన్: విద్యార్థులు సామాజిక బాధ్యతగా గ్రామాల్లో ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించాలని స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్‌రెడ్డి సూచించారు. కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులకు ఓటు హక్కు చైతన్యంపై శుక్రవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పోటీలలో పాల్గొన్న విద్యార్థులను స్వీప్ ప్రతినిధులు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ రామస్వామి, అధ్యాపకులు శివకుమార్, రాజ్‌కుమార్, శ్రీలత పాల్గొన్నారు.

కార్తీక పురాణం వింటే పాపాలు తొలగుతాయి



కామారెడ్డి రూరల్: కార్తీక మాసంలో శివకేశవులకు సమానమైన మాసం వేరే కాదని, గత జన్మ పాపాలతో ఈ జన్మలో కొన్ని సమస్యలకు గురైన మానవుడు కార్తీక పురాణం ప్రవచనం వింటే సమస్త పాపాలు తొలగతాయని శ్రీ రామకోటి జప లిఖిత ప్రచారకుడు క్రిష్ణానంద స్వామి ప్రబోధించారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని అడ్లూర్ గ్రామంలో భక్తుల ఇంట్లో కార్తీక పురాణ ప్రవచనం చెప్పారు. మానవులలో రెండు రకాల గుణాలు గల వారు ఉంటారని, దైవ సంపత్తి గలవారు దేవుని దగ్గరికి, రాక్షస సంపత్తి గలవారు నరకానికి పోయే అవకావం ఉందన్నారు.

దొరల పాలనను అంతం చేయాలి

- ఎంపీ ధర్మపురి అర్వింద్



రామడుగులో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

ధర్పల్లి: తెలంగాణలో కొనసాగుతున్న దొరల పాలనను అంతం చేయాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. మండలంలోని రామడుగు గ్రామంలో రూరల్ బీజేపీ అభ్యర్థి కులాచారి దినేశ్‌కు మద్దతుగా శుక్రవారం ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి దోచుకున్న వాళ్లను ప్రజలు ఓటుతో జవాబు చెప్పి బుద్ధి చెప్పాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని అని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. 75 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్క బీసీ ముఖ్యమంత్రి దొరకలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన బీసీ డిక్లరేషన్ అరచేతిలో వైకుంఠంలాగా ఉందని, మరోసారి బీసీలకు అన్యాయం చేయడానికి రేవంత్ కుట్ర పన్నారని పేర్కొన్నారు. ప్రచారంలో నాయకులు గడ్డె భూమన్న, రాజేశ్వర్, కర్క గంగారెడ్డి, రామస్వామి, గంగాదాస్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

మాచారెడ్డి: ఎల్లంపేట, సోమారంపేట, అక్కాపూర్ గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ బూత్‌లను కామారెడ్డి డీఎస్పీ ప్రకాష్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యాత్మక పోలింగ్ బూత్‌లపై దృష్టి సారించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ఎన్నికలు సజావుగా సాగేలా అందరూ సహకరించాలని కోరారు. మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్ గౌడ్, సిబ్బంది ఉన్నారు.

మొక్కలను సంరక్షించాలి

కామారెడ్డి రూరల్: హరితహారంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఎంపీవో మలహరి సూచించారు. శుక్రవారం వాటరింగ్ డేను పురస్కరించుకుని కామారెడ్డి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని మొక్కలకు నీళ్లు పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవాళి మనుగడ మొక్కలపైనే ఆధారపడి ఉంటుందని, ప్రతి ఒక్కరూ మొక్కలకు నీళ్లు పోస్తూ సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీవో శ్రీనివాస్, టీఏ సాంబాజీ, సీనియర్ అసిస్టెంట్ రమేష్, తదితరులున్నారు.

సరికొత్తగా..

- ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక చర్యలు
- పోలింగ్ శాతం పెంచడమే లక్ష్యం


బాన్సువాడ: ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతగా వినియోగించి ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు శ్రీకారం చుట్టింది. గతంతో పోలిస్తే ఈ సారి ఎన్నికలు మరిన్ని కొత్త పద్ధతులు, విధానాలను ఎన్నికల సంఘం ప్రవేశపెడుతోంది.

సీ విజిల్‌కు మరింత పదును

ఎన్నికల్లో నిర్వహించే అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు 2014లో ఎన్నికల సంఘం సీ విజిల్ యాప్‌ను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం దీన్ని ఆధునికీకరించడంతో పాటు ఎఫ్ఎస్‌టీతో అనుసంధానం చేసింది. అక్రమానికి సంబంధించిన ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేస్తే వంద నిమిషాల వ్యవధిలో అధికారులు అక్కడికి చేరుకుని దర్యాప్తు చేపట్టి ఫిర్యాదుదారుకు సమాచారం ఇస్తారు. ఫిర్యాదు సమాచారం జిల్లా ఎన్నికల అధికారితో పాటు నియోజకవర్గ పరిధిలోని ఫ్లయింగ్ స్క్వాడ్‌కు చేరుతుంది.

ఈవీఎంలపై అభ్యర్థుల ఫొటోలు

తమ అభ్యర్థిని గుర్తించేందుకు వీలుగా ఎన్నికల సంఘం ఈవీఎంలలో స్వల్ప మార్పులు చేసింది. గతంలో ఓటింగ్ యంత్రాలపై పార్టీ గుర్తు, అభ్యర్థి పేరు మాత్రమే ఉండేవి. ప్రస్తుతం నిర్వహించే అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ఫొటోలు కూడా పెట్టనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. పోస్టల్ బ్యాలెట్‌పైన ముద్రించేందుకు చర్యలు చేపట్టింది.



మై ఓటర్ హెల్ప్‌లైన్ యాప్

మై ఓటర్ హెల్ప్‌లైన్ యాప్

గతంలో ఓటర్లకు తమ ఓటు ఏ కేంద్రంలో ఉందో తెలియకపోవడం, కుటుంబ సభ్యుల ఓట్లు వేర్వేరు చోట్ల ఉండడంతో ఓటింగ్ శాతం తక్కువగా నమోదవుతున్నట్లు ఎన్నికల సంఘం గుర్తించింది. ఈ నేపథ్యంలో మై ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ప్రవేశపెట్టింది. ఈ యాప్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని ఓటరు కార్డు ఎపిక్ నంబర్ అందులో నమోదు చేస్తే ఏ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసే అవకాశం ఉందో తెలుస్తుంది.

ముందే పోస్టల్ ఓటింగ్

ఎన్నికల ప్రక్రియలో భాగస్వాయులయ్యే అధికారులు, సిబ్బంది ఈ దఫా పోలింగ్ ప్రక్రియ ప్రారంభించడానికి ముందుగానే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించారు. గతంలో పోస్టల్ బ్యాలెట్లను ఎన్నికల విధులకు హాజరయ్యే సమయంలో వేసేందుకు అవకాశం ఉండేది.

యూత్ పోలింగ్ కేంద్రాలు

మహిళలు, దివ్యాంగుల ఓటు శాతం పెంపొందించే ఉద్దేశంతో గతంలో వీరికి ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో యువ ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో యూత్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. వీటిని యువ అధికారులే నిర్వహించనున్నారు. మొదటి సారి నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేయనున్నారు.

అకౌంటింగ్ బృందాల ఏర్పాటు

ఎన్నికల సమయంలో వ్యయ నియంత్రణ అనేది లేకుండా పోతోంది. ఈ నేపథ్యంలో ఖర్చులను కట్టడి చేసేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో మొదటిసారి నియోజకవర్గానికో అకౌంటింగ్ బృందాన్ని ఏర్పాటు చేసింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల వ్యయ పరిశీలనకు 15 రోజులకొకసారి వివరాలు అందించాల్సి ఉండేది. ప్రస్తుతం ప్రచారంతో పాటు ఇతరత్రా కార్యక్రమాలు చేస్తున్న వ్యయాన్ని పరోక్షంగా అకౌంటింగ్ బృందాలు పరిశీలించనున్నాయి.

క్రైం కార్నర్

మెక్సికోలో రెంజల్ యువకుడి గల్లంతు

రెంజల్: మెక్సికోలో మండల కేంద్రానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి అనే యువకుడు గల్లంతయ్యాడు. బాధిత కుటుంబీకులు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. బతుకుదెరువు నిమిత్తం మెక్సికోలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పదినెలల నుంచి పనిచేస్తున్నాడు. ఓడలోని హోటల్‌మేనేజ్‌మెంట్ విభాగంలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి సముద్రంలో పడి గల్లంతైనట్లు చెప్పారు. యువకుడు పనిచేస్తున్న కంపెనీ వారు పూర్తి సమాచారం అందించడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం సాయంత్రం పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఒకరి అదృశ్యం

మాక్లూర్: మండలంలోని ముల్లంగి(బి) గ్రామానికి చెందిన బూరోల్ల రాజు అదృశ్యమైనట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. రాజు ఈ నెల 10న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. రాజు భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తనిఖీల్లో నగదు పట్టివేత



నిజాంసాగర్: మండలంలోని నర్సింగ్‌రావ్‌పల్లి చౌరస్తాలో వాహనాల తనిఖీల్లో భాగంగా ఒకరి నుంచి రూ. లక్ష నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. నగదుకు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఉన్నతాధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



ఇంతియాజ్ (ఫైల్)

తాడ్వాయి: మండలంలోని క్రిష్ణాజివాడిలో దూదేకుల ఇంతియాజ్ (25)అనే యువకుడు శుక్రవారం విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. గ్రామ శివారులోని తన ఫౌల్ట్రీఫాం వద్దకు వెళ్లిన ఇంతియాజ్ అక్కడనేఉన్న సింగిల్‌ఫేజ్ స్థంబానికి కరెంట్ వైర్ పెడుతుండగా విద్యుదాఘాతంతో మృతి చెందాడు. స్థానికుల సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య అఫ్రిస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో..

ఇందల్వాయి: మండలంలోని దేవీతండాలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని బోధన్ మండలం పెంటకుర్దు గ్రామానికి చెందిన మహబూబ్ (56) మృతి చెందినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. మృతదేహాన్ని మండల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



మృతదేహాన్ని తీసుకెళ్తున్న మున్సిపల్ సిబ్బంది

ఆర్మూర్: ఆర్మూర్ పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న సైదాబాద్ కాలనీలో గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు శుక్రవారం ఉదయం గుర్తించారు. అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు మున్సిపల్ అధికారులకు ఫోన్‌లో సమాచారం అందించగా అది తమ పని కాదని పోలీసులు పంచనామా చేయాల్సి ఉంటుందని చెప్పారు. దీంతో స్థానికులు డయల్ 100కు ఫోన్ చేయగా మధ్యాహ్నం 12.30 గంటలకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మున్సిపల్ సిబ్బందితో మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఆర్మూర్‌టౌన్: ఆలూర్ మండలంలోని దేగాం రోడ్డులో ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఆటోలో మద్యం తరలిస్తున్న సిద్దాపూర్ గ్రామానికి చెందిన విఠల్‌ను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ స్టీవెన్సన్ తెలిపారు. మద్యాన్ని, ఆటోను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. తనిఖీలో ఎస్సైలు గంగాధర్, ప్రమోద్, చైతన్య, చంద్రమౌళి, సిబ్బంది వికాస్‌గౌడ్, సందీప్, దేవీదాస్, నరేశ్ పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన



రుద్రూర్: కోటగిరిలోని మైనారిటీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం వైద్య సిబ్బందితో కలిసి మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్య సమస్యలు తెలుసుకొని మందులు అందజేశారు. వంటశాలలను పరిశీలించారు. ప్రిన్సిపాల్స్ ఎండీ బషీరుద్దీన్, సవిత రాణి, ఏఎస్ఎం ప్రియదర్శిని, వైద్య సిబ్బంది జ్యోతి, శ్రీదేవి ఉన్నారు.